
# మేకప్



"ఊర్వశీ! నీవు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా?"

"ఏం మీరు నన్ను ప్రేమించడం లేదా?"

"కాకపోతే నీ వెనుక ఇలా పిచ్చికుక్కలా తిరుగుతానా?"

— కప్పగంతుల మల్లికార్జునరావు

‘నేను మాత్రం మిమ్మల్ని ఇలా నా గదిలోకి రానిస్తానా?’

‘రానిచ్చి మాత్రం ఏం లాభం? నువ్వక్కడ, నేనిక్కడ? అంతేగా?’

రాజారావు అలిగినట్టు మొహం పెట్టి నిష్ఠూరంగా అన్నాడు.

అతని స్థితిని చూసి ఊర్వశి పకపకా నవ్వింది.

తన కుర్చీలో నుంచి లేచి ఒయ్యారాలు ఒలికిస్తూ నడిచి వచ్చి సోఫాలో అతని పక్కన కూర్చుంది.

‘కోపం వచ్చిందా? అబ్బ! కోపం వస్తే మీరెంత అందంగా వుంటారో? అమాంతం మిమ్మల్ని కొరుక్కుతినాలని నాకు బుద్ధి పుడుతున్నదబ్బా!’ అతని మెడ చుట్టూ చేతులు వేసి మృదువుగా అంది.

రాజారావు మనసు ఒక్కసారిగా మత్తెక్కినట్టయింది. శరీరం వేడెక్కిపోయింది. నరాలు జివ్వుమన్నాయి.

‘ఐ లైక్ యూ ఊర్వశీ. ఐ వాంట్ యూ’ ఆపుకోలేని తమకంతో ఆమె భుజం మీద చెయ్యి వేసి దగ్గరికి లాక్కోబోయాడు.

‘హోల్డాన్ సర్. ప్లీజ్ హోల్డాన్’ ఆమె అతనికి దూరంగా జరిగింది.

రాజారావుకు ఒక్కసారిగా నీరసం వచ్చినట్టయింది. సోఫాలో చేరగిల పడిపోయాడు.

‘ఛీ. నువ్వెప్పుడూ ఇంతే. స్వర్గ లోకానికి తీసుకెళ్ళినట్టే తీసుకెళ్ళి పాతాళానికి తోసేస్తావ్’ అతను నీరసంగా గొణిగేడు.

‘ఏం చెయ్యను డార్లింగ్? నేను ఆడదాన్ని. నువ్వు మగవాడివి.’

‘అదేమంటే యిదో డైలాగు!’

‘పైగా నేను పెళ్ళికాని మోడల్ గాల్‌ని. నువ్వు పెళ్ళయిన రిచ్‌మేన్‌వి. ఆ మాత్రం జాగ్రత్త పడకపోతే నా బ్రతుకు సినిమా హీరోయిన్ల బ్రతుకు కాదూ!’

‘నా బాధంతా నిన్ను పెళ్ళి చేసుకోవాలనే కదా? నా భార్య చేత మన వివాహానికి అంగీకరింపచేశాను. ఆమె రాసిచ్చిన కాగితం ఇదిగో. అయినా, నువ్వే మన పెళ్ళికి అంగీకరించడం లేదు. నేనేం చెయ్యను?’

ఆమె మళ్ళీ ఒయ్యారంగా నవ్వుతూ వచ్చి అతని పక్కన కూర్చుంది.

‘నిష్ఠూరమంతా నా నెత్తినే వెయ్యడం అన్యాయం రాజారావు సాబ్. పెళ్ళి చేసుకోడానికి నా కండిషన్స్‌ని మీకు ముందే చెప్పేను. మన పెళ్ళికి కావల్సింది మీ భార్య అనుమతి కాదు. మీ భార్య నుంచి విడాకుల పత్రం. మీరు నా కన్నా వయసులో పెద్దవారు. ఒకసారి పెళ్ళయినవారు. అయినా మిమ్మల్ని పెళ్ళి చేసుకోడానికి నేను మనస్ఫూర్తిగా అంగీకరించాను. మరి పెళ్ళికి ముందు నేను అడిగే స్వల్ప కోరికలను తీర్చడం మీ ధర్మం కాదా? నా కోరికలను తీర్చకుండా నన్ను పొందాలనుకోడం మీకు న్యాయమా? అయినా మీ భార్య సత్తెకాలపు మనిషని, మహా పతివ్రత అని అన్నారు కదా! ఆమె నుంచి విడాకులను పొందలేరా? ఏం మగవారండీ మీరు? ఊఁ!’

ఆమె అతడిలోని పురుషత్వంతోపాటు పౌరుషాన్ని, అహంభావాన్ని కూడా రెచ్చగొట్టింది.

‘అయితే చూస్తుండు. రేపీపాటికి విడాకుల కాగితం తీసుకొచ్చి నిన్ను అప్పటికప్పుడు గాంధర్వ వివాహం చేసుకొంటాను’ శపథం చేసినట్టుగా అని అతను రూమ్ బయటికి నడిచేడు.

‘డార్లింగ్. వన్ వర్డ్ ...’

గడప దాటబోతున్న అతను ఆగి ఏమిటన్నట్టు వెనక్కి తిరిగి చూశాడు.

‘ఇలా పౌరుషంగా శపథాలు చేసి వెళ్ళడం ఇది ఎన్నో సారి?’

‘ఆఖరు సారి.’

తన ప్రతాపాన్నంతా డోర్ మీద చూపించి వెళ్ళిపోయాడు రాజారావు

... ... ... ... ... ... ... ... ...

పార్వతి పూజామందిరంలో పూజ చేస్తున్నది.

ఆ మందిరంలో అనేక దేవతల ఫోటోలు, విగ్రహాలు వున్నాయి.

అయితే ఆమె దృష్టి వాటి మధ్యలో వున్న రాజారావు ఫోటో పైన వుంది.

రాజారావు పెళ్ళినాటి ఫోటో అది. అందులో రాజారావు చాలా బీదగా వున్నాడు.

పెళ్ళినాటికి రాజారావు నిజంగానే చాలా బీదవాడు. పార్వతిని పెళ్ళి చేసుకున్నాక అతనికి అదృష్టం కలిసి వచ్చింది. నీటి ఊటలా సిరి తన్నుకొని వచ్చింది.

ధనవంతుడయ్యాక రాజారావు చాలా మారిపోయాడు.

బీదరికమంటే అసహ్యం, బీదవారంటే అంతకన్నా అసహ్యం పెంచుకొన్నాడు.

పుట్టుకతోనే తాను రాజకుమారుడయినట్టు అతను భావిస్తుంటాడు, ప్రవర్తిస్తుంటాడు.

‘విద్య వినయాన్ని పెంచాలంటారు. అలాగే ఐశ్వర్యం మనిషిలో త్యాగ గుణాన్ని, దానశీలతను, ఔదార్యాన్ని పెంచాలి. అప్పుడే మన ఐశ్వర్యం సార్థక్యాన్ని పొందుతుంది!’

మొదట్లో పార్వతి అలా చెప్తే విని వూరుకొనేవాడు. ఆ తర్వాత విసుక్కున్నాడు. ఆపైన రాజారావ్ ఆమెకు నీతి బోధలు చేయసాగాడు.

‘లేనివాళ్ళు ఎలాగూ లేక చస్తున్నారు. ఉన్నవాళ్ళం కూడా దానధర్మాలు, త్యాగాలు, గీగాలు అనుకొంటూ అనుభవాల్ని కాలదన్నుకుంటే కోపమొచ్చి లక్ష్మీదేవి మనల్ని వదిలిపోతుంది. సంపాదించే వాడిని నేనుండగా అనుభవించడానికి నీకేం రోగం? అమ్మమ్మ వేషాలు వేయక అనుభవించడం నేర్చుకో. కాస్త బయటకొచ్చి లోకాన్ని చూడు. ఇన్నాళ్ళుగా నువ్వు ఎంత నష్టపోయావో, నా కెంత నష్టం కలిగిస్తున్నావో తెలుస్తుంది.

బలవంతంచేసి ఆమె చేత రకరకాల మోడ్రన్ డ్రెస్‌లను ధరింపచేశాడు. క్లబ్‌లకు, పార్టీలకు, కాబరే డాన్స్‌లకు తీసుకెళ్ళాడు. సినిమా స్టారులనీ, పొలిటీషియన్స్‌నీ, ఇండస్ట్రియల్ మేగ్నెట్స్‌నీ ఆమెకు పరిచయం చేశాడు.

అయినా, ఆమె మారలేదు. అతడిని మార్చాలన్న ప్రయత్నాన్ని ఆమె కూడా మానుకొంది.

భార్యతో విసిగిపోయాడు రాజారావు.

‘నిన్ను మార్చడం నాక్కాదు కదా ఆ బ్రహ్మక్కూడా తరం కాదు. నీ ఏడుపు నువ్వు ఏడువు. కానీ, నీకు పుట్టబోయే బిడ్డల్ని మాత్రం నీలాగా త్రేతాయుగం మనుషుల్లా పెరగనివ్వను. నా అభిరుచికి తగ్గట్టు అప్ టు డేట్‌గా అల్ట్రా మోడ్రన్‌గా తీర్చిదిద్దుతా!’

అయితే రాజారావు ఆ కోరిక తీర లేదు.

పార్వతి మూడుసార్లు గర్భంలోనే బిడ్డల్ని పోగొట్టుకుంది.

‘ఊరికే ఆ దేముళ్ళను ఎందుకు పూజిస్తావ్? ఒక్క దేముడన్నా నీ బిడ్డల్ని బ్రతికించగలిగేడా?’ విరాగ్గా అన్నాడు రాజారావు.

‘కన్పించని ఆ దేముళ్ళ సంగతలా వుంచండి. కానీ మీ డబ్బు, ఆ డబ్బుతో కొన్న డాక్టర్లు మాత్రం బ్రతికించగలిగేరా? మన కర్మను నా దేముళ్ళూ మార్చలేరు, మీ డబ్బూ మార్చలేదు.’


నీ కర్మను మార్చలేకపోవచ్చు. కానీ నా డబ్బుతో నా కర్మను మార్చుకొంటాను. చూస్తుండు.’

అప్పటి నుంచి రాజారావు రెండో భార్య కోసం అన్వేషణలో పడ్డాడు. అయినా పార్వతిని నిర్లక్ష్యం చేయలేదు. ఆమెను పెళ్ళి చేసుకున్నాకే తనకు అదృష్టం కలిసి వచ్చిందని, ఆమె కన్నీళ్ళు పెట్టుకుంటే ఆ అదృష్టం కాస్తా పోతుందేమోనన్న సెంటిమెంట్ అందుకు కారణం.

‘పార్వతీ నువ్వంటే నా కెంత ఇష్టమో నీకు తెలుసు. అయినా, నీ కోసం నా సుఖాలను ఎంతకాలం వదులుకోను చెప్పు. నీకు వయసు పెరిగే కొద్దీ కోరికలు చస్తున్నాయి. నాకేమో పెరుగుతున్నాయి.

‘అదే తప్పండీ. మనిషికి మితిమీరిన కోరికలే శత్రువులు.’

‘పైగా నా వంశం నాతోనే అంతం కావడం నాకిష్టం లేదు.’



'నాకు మాత్రం ఇష్టమా? ముగ్గురు బిడ్డలు పోవడానికి, మరింక బిడ్డలు పుట్టక పోవడానికి నా లోపం కారణం కాదని డాక్టర్లు చెప్పలేదూ? ఏం చేస్తాం. మన ప్రాప్తం ఇంతేననుకొని ఎవరన్నా బీద యింటి పిల్ల వాడిని దత్తత చేసుకొందామండీ.'

'అదంతా పాత పద్ధతి పార్వతీ. దత్తుడు డబ్బువాడే కానీ, నా కన్న కొడుకవుతాడా? ఈ ఫోటో చూడు. ఊర్వశి ఆ అమ్మాయి పేరు. మోడల్ గాల్. చాలా అందంగా వుంది కదూ?'

'మీకలా కన్పిస్తున్నదా? అదంతా ఆ అమ్మాయి వయసు మహిమ, ఆ అమ్మాయి వేసుకున్న మేకప్ మహిమ, ఫోటోగ్రాఫర్ మహిమ. ఆ వయసులో నేను అంతకన్నా అందంగా, సహజంగా వుండేదాన్ని. కాదూ?'


'ఆ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకోవా లనుకుంటున్నాను. ఆ అమ్మాయి కూడా అంగీకరించింది.'

'పాపం!'

'మనం విడాకులు తీసుకొంటే కానీ ఆమెను పెళ్ళి చేసుకోడం కుదరదు మరి!'

'విడాకులా? ఇన్నేళ్ళు నాతో కాపురం చేసి ఇప్పుడు విడాకులంటున్నారా? ఎంత అన్యాయమండీ? అంతగా మీ ఇద్దరూ కావా లనుకుంటే పెళ్ళి చేసుకోండి. నాకు అభ్యం తరం లేదని రాసిస్తాను. కానీ, విడాకులకు మాత్రం చస్తే అంగీకరించను. మీ భార్యగా నన్ను కడతేరనివ్వండి. ప్లీజ్ ... మీ సుఖానికి నే నెప్పుడూ అడ్డురాను.'

ఆమె కన్నీరు పెట్టుకొంది. అతనికి తన ఐశ్వర్యమంతా హారతి కర్పూరంలా హరించి పోతున్నట్టనిపించింది. ఆమె రాసిచ్చిన



కాగితం తీసుకొని వెళ్ళిపోయాడు.

'భగవంతుడా ఆయన కోరికల్ని తీర్చు. భర్త ఫోటోనే చూస్తూ ఆమె కనపడని దేవుళ్ళని ప్రార్థించింది.

కారు డ్రయివ్ చేస్తున్నా ఊర్వశి యవ్వన సౌందర్యమే అతనికి కారు అద్దాలలో కన్పి స్తోంది.

ఐశ్వర్యం అంతా హరించుకుపోయినా సరే, పార్వతికి విడాకులిచ్చి ఊర్వశిని పెళ్ళి చేసుకోవలసిందే. ఆ అందాన్ని, లావణ్యాన్ని వదులుకోవడం తనకు సాధ్యం కాదు.

లాయర్ దగ్గరికెళ్ళి డైవోర్సు పత్రాలు అవీ సిద్ధం చేసుకొని, అందుకు కావలసిన ఇతర ఏర్పాట్లన్నీ కూడా చేయించి ఇంటి కొచ్చాడు.

మొహాన ఇంత పెద్ద కుంకుమ బొట్టు నెరసిన వెంట్రుకల చింపిరి తలతో, ప్రసాదం పళ్ళెం పట్టుకొని ఎదురొచ్చింది పార్వతి.

ఆమె పక్కనే ఊర్వశి వయ్యారంగా ఒక్క క్షణం నిలిచి మాయమయింది.

'ఛీ. ఈమెతోనా తానిన్నాళ్ళు కాపురం చేసింది? ఎంత జీవితం వేస్ట్?'

'మీ సుఖం కోసం ప్రత్యేకంగా పూజలు చేసేనివాళ. ప్రసాదం తీసుకోండి.'

'ఓహో! అలాగా? అయితే, ఈ కాగితాల మీద సంతకం పెట్టు' ప్రసాదం నోట్లో వేసుకొని శాసిస్తున్నట్టు అన్నాడు.

'కాగితం రాసిచ్చాగా? ఇంకా ఏం కాగితం?'

'మనం డైవర్సు తీసుకుంటేనే కాని పెళ్ళి చేసుకోనంది ఊర్వశి. అందుకే డైవ ర్సుకు ఏర్పాట్లన్నీ చేసి వచ్చాను. సంతకం పెట్టు.'

'మీకు భార్యగా కడతేరాలన్నది నా కోరికని చెప్పేను కదా?'



'అవన్నీ పాత మాటలు! పిచ్చి సెంటి మెంట్లు. అలాంటివి నాకు నచ్చవు. సంతకం పెట్టు ముందు' గుండెలకు మిషన్‌గన్ గురి పెట్టి అడిగినట్టు అడిగేడు.

ఆమె ఒక్క క్షణం ఆలోచించి బాంబు పేల్చింది.

'అలాగే పెడ్తాను. కానీ, అంతకు ముందు నేనడిగే కొన్ని ప్రశ్నలకు సమా ధానం చెప్పాలి.'

'త్వరగా అడుగు.'

'మీ వయసెంత?'

'నలభై సంవత్సరాలు.'

'కాదు. ఖచ్చితంగా నలభై ఏడు సంవ త్సరాల ఎనిమిది నెలల పన్నెండు రోజులు. వయసును ఆడవాళ్ళు తగ్గించి చెప్పకొంటా రంటారే, మరి మీ కెందుకా ఖర్మ పట్టింది?'

'నా వయసు నలభై.అయితే ఏమిటి?' కోపంగా అన్నాడతను.

'ఉంది. ఊర్వశి వయసెంత?'

'తననడిగితే ఇరవై అంది. కానీ, ఇరవై రెండేళ్ళు. చాలా? ఇంకేమన్నా ప్రశ్న లున్నాయా?'

'మనకి పుట్టిన బిడ్డలు బతికినట్టయితే ఊర్వశి వయసు వుండేదన్న మాట! అయినా ఆ అమ్మాయి మిమ్మల్ని భర్తగా అంగీక రిస్తున్నదంటే అదామె ఖర్మ కాదూ? ఇలాంటి ఖర్మ మీ ఇద్దరికీ పట్టడమే అసహజం. ఈ విషయం తెలిసి మీ రిద్దరూ భార్యా భర్తలు కావాలనుకోడం మరింత అసహజం. నా నుంచి బలవంతంగా విడా కులు తీసుకొని ధర్మం తప్పగలరేమో కాని, దాంపత్య సుఖాన్ని పొందలేరు.'

'శపిస్తున్నావా?'

'కాదు. మీ భవిష్యత్ జీవితాన్ని తల్చు కొని బాధపడుతున్నాను, భయపడు తున్నాను. అయినా, మీకు సుఖాన్నివ్వమని ఆ



భగవంతుని ప్రార్థించడం తప్ప ఇక నేను చేయగలిగిందేముంది? ఎక్కడ సంతకం చేయమంటారో చెప్పండి ... ... ...

... ... ... ... ... ... ... ... ... ...

మర్నాడు కొన్ని గంటలసేపు బ్యూటీ క్లినిక్‌లో స్పెండ్ చేసి అక్కడి నుంచి ఊర్వశి ఇంటికెళ్ళాడు రాజారావు.

అప్పుడు ఊర్వశి సోఫాలో ఒక యువకుడి పక్కన కూర్చుని నవ్వుతూ చనువుగా మాట్లాడుతున్నది.

'నా భార్య చేత విడాకుల పత్రం మీద సంతకం పెట్టించాను. ఇదిగో చూడు. త్వరగా కోర్టువారు విడాకుల పత్రాన్ని ఇచ్చే ఏర్పాటు కూడా చేసే వచ్చాను. ఇక నీదే ఆలస్యం.'

ఊర్వశి అతడినే కాసేపు చూసి నవ్వును ఆపుకోలేనట్టు బిగ్గరగా నవ్వసాగింది.

'నా భార్య నుంచి విడాకుల్ని సాధించక పోతే నవ్వాలి. విడాకుల్ని పొందేనంటే ఎందుకు నవ్వుతావ్?' కోపంగా అన్నాడు రాజారావు.

'ఆ నిలువుటద్దంలో ఒక్కసారి మీ రూపాన్ని చూసుకోండి. పొట్ట చేతపట్టుకొని తెరలు తెరలుగా నవ్వుతూనే అందామె.

ముసలి సినిమా హీరోలకు ఎన్నోసార్లు మేకప్ చేసి చేసి రిటైరయిన అతని చేతనే కదా మేకప్ చేయించుకొంది? ఎంగ్ హాలి వుడ్ హీరోలా తయారుచేసేడు కదా తనని?

ఇంతలో మేకప్ చెడిపోయిందా?

రాజారావు అద్దంలో చూసుకొన్నాడు.

విగ్గు-మేకప్- అన్నీ అలాగే వున్నాయి కదా? ఎందుకు నవ్వుతుంది?

'మొహం మీద ముడతల్ని, నెరసిన వెంట్రుకలని, బట్టతలని, మేకప్‌తో తాత్కాలికంగా కప్పేసుకోవచ్చు. కెమెరా ముందు తళతళా మెరిసిపోవచ్చు. కానీ, ఎంత దాచినా దాగనిది వయస్సు. మీకో



రహస్యం చెప్పనా? రోజూ వృత్తిరీత్యా వేషం వేసుకోడానికి అలవాటుపడ్డ మాకు ఈ మేకప్‌లు అంటే అసహ్యం. ఈ వయసులో మీ కెందుకీ మేకప్ క్రేజ్?'

'మోడల్ గాల్‌ని - నిన్ను పెళ్ళి చేసుకో బోతున్నాను కదా? అందుకు—'

'బైది బై. మిస్టర్ మోహన్, ఈ యువ వృద్ధుడుగారి పేరు రాజారావు. బోలెడంత డబ్బు సంపాదించాడు. ఆ డబ్బుతో నా వయసును కొనుక్కోవాలని కోరికపడ్డాడు. భార్యకు విడాకులు కూడా ఇచ్చి వచ్చాడట. విన్నావు గదా?'

నవ్వుతూనే మోహన్ చేతులు జోడిం చాడు.

'ఇక - ఇతని పేరు మీరు వినే వుంటారు రాజారావుగారు. పరుగుల రాజా. జంపుల సామ్రాట్టు. మేకప్‌లు లేని నన్ను చిన్నప్పటి నుంచి తెలిసిన వ్యక్తి. ప్రేమించిన వ్యక్తి. త్వరలో నాకు కాబోయే భర్త.'

'భర్త! మోసం! దగా!'

'అంతంత పెద్ద మాటలకి నేను అర్హు రాలిని కాదు సార్. లైఫ్ ఈజ్ జస్ట్ ఎ గేమ్. టు రిఛ్ పీపుల్. అందుకే మీ డబ్బుతో నా వయసును కొందామనుకున్నారు. బట్ ఐ యామ్ ఎ పూర్ గాల్ సార్. లైఫ్ ఈజ్ నాట్ ఎ గేమ్ టు మీ. ఎందుకంటే గెలుపు ఓటములను కొనుక్కొనే ధన శక్తిగాని, తట్టు కొని నిలబడగలిగే ధీశక్తిగాని లేని పూర్ గాల్‌ని. పెళ్ళి చేసుకొని బిడ్డల్ని కనాలన్నది నా కోరిక. ఆ అవకాశం లేక, రాక మనసును చంపుకొని మీ వయసుతో రాజీపడి, కనీసం పెళ్ళి చేసుకున్నానన్న తృప్తినన్నా పొందుదా మనుకున్నాను. బట్ అయామ్ లక్కీ సార్. అందుకే నిన్న రాత్రి మోహన్ నన్ను వెతు క్కుంటూ వచ్చి నా జీవితానికి సరైన ట్విస్ట్ ఇచ్చాడు. మీ డబ్బుకన్నా మోహన్ యవ్వనం నాకు చాలా విలువైనది సార్. బికాజ్ యూత్ ఈజ్ ట్రూత్. ఈ మేకప్ లైఫ్‌తో విసిగిపోయాను సార్. ఏ మేకప్స్ లేకుండా నన్ను నన్నుగా, సహజంగా, చాలా మంది సగటు ఆడపిల్లల్లా బ్రతకనివ్వండి. ప్లీజ్ ...'

టీపాయ్ మీద పడివున్న విడాకుల పత్రాన్ని అతనికి అందిస్తూ ప్రాధేయపూర్వ కంగా అందామె.

రాజారావు ఆ విడాకుల పత్రాన్ని తీసు కొని పరపరా చించి ముక్కలు చేసి మెల్లగా బయటకు నడిచేడు.